

Registered No : APTEL/25/A0818

ఇది కద నిజం

సామాన్యుని సమస్యలపై నిత్యం పోరాడే ఆయుధంగా.. జాతీయ తెలుగు దిన పత్రిక



గురువారం 26-11-2026 | పేజీలు :4 | వెల :2 | సంపుటి :02 | సంచిక :157 | www.edhikadhanijam.com | ఎడిటర్ : బాలరాజు గౌడ్

చేయూత పింఛన్లకు నేడే శ్రీకారం!

- కొత్తగా 4.72 లక్షల మందికి చేయూత పెన్షన్లు
- అచ్చంపేట వేదికగా పెన్షన్ల పంపిణీకి శ్రీకారం
- సీఎం రేవంత్ చేతుల మీదుగా నగదు బదిలీ
- 10 లక్షలకు పైగా దరఖాస్తుల పరిశీలన
- నెలకు 52 లక్షల మందికి పైగా పెన్షన్లు
- పెన్షన్ల కోసం నెలకు రూ.1,100 కోట్ల వ్యయం
- కోటి మంది మహిళలకు ఇందిరమ్మ చీరల పంపిణీ



2 లో

న్యూస్ డెస్క్, 25 నవంబర్ (ఇది కద నిజం): చేయూత పథకం కింద కొత్త పెన్షనర్లకు 26న రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఉమ్మడి నాగర్ కర్నూలు జిల్లా అచ్చంపేట వేదికగా డబ్బులు పంపిణీ చేయనున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత అర్హులైన వికలాంగులు, పైలేరియా, ఏయిడ్స్, డయాలసిస్ బాధితులు, సింగిల్ ఉమెన్, వితంతువులను కలుపుకుని సుమారు 4.72 లక్షల మందిని ప్రభుత్వం గుర్తించింది. వీరందరి బ్యాంకు అకౌంట్లలోకి సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా నగదును బదిలీ చేసేందుకు పంచాయతీ రాజ్ శాఖ అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. అదే రోజు రాష్ట్ర వ్యాప్తంగా కోటి మంది మహిళలకు ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా చేయూత పెన్షన్ కోసం సుమారు 10 లక్షలకు పైగా దరఖాస్తులు వచ్చాయి.

ఎమ్మెల్సీ ఓటర్ల జాబితా.. డిసెంబర్ 10 వరకు ఛాన్స్!

- ఎమ్మెల్సీ ఓటర్ల జాబితా ముసాయిదా విడుదల
- డిసెంబర్ 10 వరకు అభ్యంతరాలు, దరఖాస్తులు
- రెండు నియోజకవర్గాల్లో 11.89 లక్షల ఓటర్లు
- హైదరాబాద్ ఎమ్మెల్సీ పరిధిలో 5.68 లక్షల మంది
- వరంగల్ ఎమ్మెల్సీ పరిధిలో 6.21 లక్షల మంది
- పాత ఓటర్ల పేర్లు ఆటోమేటిక్‌గా కొనసాగవు
- అర్హులైన పట్టభద్రులు ఫారం-18తో దరఖాస్తు
- డిసెంబర్ 30న తుది ఓటర్ల జాబితా విడుదల

2 లో

కార్తీక దీపంపై వివాదం.. విజయ్ ప్రభుత్వంపై ఫైర్!

- తిరుప్పరంకుండ్రం దీపంపై వివాదం 2 లో
- కోర్టు ఆదేశాలున్నా వెలగని దీపం
- విజయ్ ప్రభుత్వంపై హిందూ సంఘాల ఫైర్
- కోర్టు ధిక్కరణ చర్యలకు డిమాండ్
- న్యాయస్థానాల ఉత్తర్వులపై తీవ్ర చర్చ
- రివ్యూ పిటిషన్ దాఖలు చేసిందంటున్న టీవీకే
- దేశవ్యాప్తంగా చర్చకు దారి తీసిన వివాదం

దేశ రాజధానిలో ఘోరం

22 ఏళ్ల యువతిపై అఘాయిత్యం!



2 లో

న్యూస్ డెస్క్, 25 నవంబర్ (ఇది కద నిజం): దేశ రాజధాని ఢిల్లీలో మరో దారుణ ఘటన వెలుగుచూసింది. తూర్పు ఢిల్లీలోని ప్రీత్ విహార్ ప్రాంతంలో ఉన్న 'సల్తనత్' కేఫ్‌లో పనిచేస్తున్న 22 ఏళ్ల యువతిపై సహోద్యోగులు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన పోలీసులు ఆరుగురిపై కేసు నమోదు చేసి, ఇద్దరు మహిళలు సహా ముగ్గురిని

కాళేశ్వరంపై సర్కార్ కొరడా!



న్యూస్ డెస్క్, 25 నవంబర్ (ఇది కద నిజం): కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మూడు బ్యారేజీల రిపేర్ల విషయంలో ఖర్చులు నిర్మాణ సంస్థలు భరించేలా రాష్ట్ర సర్కార్ తీవ్ర కసరత్తు చేస్తున్నది. ఈ మేరకు అసెంబ్లీ సమావేశాలు నిర్వహించి మరమ్మతు ఖర్చులు ఏజెన్సీలే భరించేలా ఏకగ్రీవ తీర్మానానికి ప్లాన్ చేస్తున్నట్లు తెలిసింది. బ్యారేజీల మరమ్మతులకు సుమారు రూ.4,200 కోట్ల వరకు వ్యయం అవుతుందని అంచనా వేస్తుండగా.. ఆ భారాన్ని తాము భరించబోమని నిర్మాణ సంస్థలు చెబుతున్నాయి. దీంతో ఈ వ్యవహారం మరోసారి కీలక మలుపు తిరిగింది. ఇప్పటికే పీసీ ఘోష్ కమిషన్ తన నివేదికలో సంబంధిత ఏజెన్సీల బాధ్యతను ప్రస్తావించిన నేపథ్యంలో..

మిగతాది 2 లో..

- కాళేశ్వరం రిపేర్లపై సర్కార్ స్పెషల్ ఫోకస్
- మూడు బ్యారేజీలకు రూ.4,200 కోట్ల అంచనా
- నిర్మాణ సంస్థలపైనే ఖర్చు భారం వేయాలని ప్లాన్
- ఏజెన్సీల బాధ్యతపై అసెంబ్లీలో తీర్మానానికి కసరత్తు
- రెండు రోజుల ప్రత్యేక సమావేశాలకు ప్రభుత్వ యోచన
- మరమ్మతుల ఖర్చుపై కంపెనీల అభ్యంతరాలు
- మేడిగడ్డ రిపేర్లకే రూ.1,883 కోట్ల అంచనా
- ఎన్డీఎస్ఏ మార్గదర్శకాలతో పనులు చేపట్టే ప్లాన్
- ఏజెన్సీల నుంచి ఖర్చు రాబట్టడమే సర్కార్ టార్గెట్

బీఆర్ఎస్ అంతం తప్పదు.. కవిత సంచలనం!

- తనపై వ్యక్తిగత దాడులంటూ ఆరోపణ
- టీఆర్ఎస్ భయంతోనే టార్గెట్ చేస్తున్నారని విమర్శ
- ఇంటి నుంచి వెళ్లగొట్టారని ఆవేదన
- సాగర్ నీటి తరలింపుపై వ్యతిరేకత
- క్యాన్సర్ పేరుతో తప్పుడు ప్రచారమని ఆరోపణ
- కేసీఆర్ నిర్లక్ష్యంపై కవిత విమర్శ



న్యూస్ డెస్క్, 25 నవంబర్ (ఇది కద నిజం): త్వరలో బీఆర్ఎస్ కొట్టుకుపోతుందంటూ టీఆర్ఎస్ అధినేత్రి కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. ఓ మీడియా ఛానల్‌లో ఆమె మాట్లాడుతూ.. బీఆర్ఎస్ నేతలు తనపై దాడి చేస్తున్నారని చెప్పారు. తనను వ్యక్తిగతంగా టార్గెట్ చేస్తున్నారని, అలా చేస్తే ఏం వస్తుందని ప్రశ్నించారు. టీఆర్ఎస్ పార్టీకి ఆదరణ పెరుగుతుందనే భయంతోనే తనను టార్గెట్ చేస్తున్నారని అన్నారు. తనను ఇంటి నుండి వెళ్లగొట్టారని, ఇంకా ఏం సాధిస్తారని ప్రశ్నించారు.

2 లో

కవితపై మాట దొర్లింది సీతక్క వివరణ!


2 లో

- కవితపై వ్యాఖ్యలో పొరపాటు దొర్లింది
- వివరం వ్యక్తం చేసిన మంత్రి సీతక్క
- కావాలని ఆ పదం అనలేదని వివరణ
- వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకున్నా ట్రోలింగ్
- వీడియో వైరల్ చేయడంపై సీతక్క ఆగ్రహం
- అక్కసుతోనే తనపై దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపణ

డ్రగ్స్‌పై సమరానికి కిషన్ రెడ్డి శ్రీకారం!

- డ్రగ్స్ వ్యతిరేకంగా కిషన్ రెడ్డి పాదయాత్ర
- అంబర్‌పేట నుంచి ముషీరాబాద్ వరకు యాత్ర
- పాదయాత్రలో పాల్గొన్న నటుడు వెంకటేశ్
- మత్తు రహిత భారత్ ప్రధాని సంకల్పం
- యువత భవిష్యత్తును నాశనం చేస్తున్న డ్రగ్స్
- డ్రగ్స్‌పై అవగాహన కల్పించడమే యాత్ర లక్ష్యం
- 'నో టు డ్రగ్స్.. యెస్ టు లైఫ్' పిలుపు



న్యూస్ డెస్క్, 25 నవంబర్ (ఇది కద నిజం): యువత భవిష్యత్తును నాశనం చేస్తున్న మత్తుపదార్థాల మహమ్మారిని తరిమికొట్టేందుకు కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి నాయకత్వంలో డ్రగ్స్ వ్యతిరేక అవగాహన పాదయాత్ర బుధవారం ప్రారంభమైంది. మూడు రోజుల పాటు సాగే ఈ యాత్ర తొలిరోజు అంబర్‌పేట నుంచి ముషీరాబాద్ వరకు సాగుతోంది. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు, ప్రముఖ సినీ నటుడు 'విక్టరీ' వెంకటేశ్ సహా పలువురు రాజకీయ ప్రముఖులు, విద్యార్థులు, యువత పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

తెలంగాణకు వర్షాల అలర్ట్!



- బంగాళాఖాతం ద్రోణితో వాతావరణంలో మార్పులు
- పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు
- హైదరాబాద్‌లోనూ వర్షం కురిసే అవకాశం
- ఉదయం వేళల్లో దట్టమైన పొగమంచు
- వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని సూచనలు
- నవంబర్ 29 నుంచి పెరగనున్న చలి తీవ్రత 2 లో

కేంద్ర కేబినెట్ కీలక ముద్ర!

- కేంద్ర కేబినెట్‌లో ఐదు కీలక నిర్ణయాలు
- కామరాజర్ పోర్టులో రెండో టెర్మినల్‌కు ఆమోదం
- పోర్టు నిర్మాణానికి రూ.4,288 కోట్ల కేటాయింపు
- అసోంలో కొత్త గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్
- విమానాశ్రయ నిర్మాణానికి రూ.2,014 కోట్లు
- దక్షిణాది ఎగుమతులు, దిగుమతులకు ఊతం
- నిర్మాణ పరికరాల తయారీకి రూ.11 వేల కోట్ల పథకం
- పోస్టల్ ఆపరేషన్స్‌కు రూ.1,141 కోట్ల కేటాయింపు
- ఎస్టేట్స్ మేనేజ్‌మెంట్ పథకానికి రూ.1,491 కోట్లు


2 లో

న్యూస్ డెస్క్, 25 నవంబర్ (ఇది కద నిజం): తమిళనాడులోని కామరాజర్ పోర్ట్‌లో రెండో కంటైనర్ టెర్మినల్ నిర్మాణానికి రూ. 4,288 కోట్లు, అసోంలోని సిల్చార్‌లోని దోలూ వద్ద గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయ అభివృద్ధికి రూ. 2,014 కోట్లతో సహా ఐదు కీలక ప్రాజెక్టులకు కేంద్ర మంత్రివర్గం బుధవారం ఆమోదం తెలిపింది. న్యూఢిల్లీలో జరిగిన క్యాబినెట్ సమావేశ వివరాలను కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు.

కామరాజర్ పోర్ట్ లిమిటెడ్‌లో రెండో కంటైనర్ టెర్మినల్‌ను పబ్లిక్-ప్రైవేట్ పార్టనర్‌షిప్ పద్ధతిలో డీబీఎఫ్ఓటీ విధానంలో రూ. 4,288.26 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్నారు. ఇందులో మొదటి దశకు రూ. 2,429.32 కోట్లు, రెండో దశకు రూ. 1,858.94 కోట్లు ఖర్చు చేస్తారు. 40 ఏళ్ల రాయితీ కాలపరిమితిలో 48 నెలల్లో నిర్మాణం పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. 900 మీటర్ల పొడవు, 18 మీటర్ల డ్రాఫ్ట్‌తో నిర్మించే ఈ టెర్మినల్ ద్వారా ఏటా 20 లక్షల టీఈయూల కంటైనర్ల సామర్థ్యం సమకూరుతుంది.

తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సహా దక్షిణాది పారిశ్రామిక ప్రాంతాల నుంచి ఎగుమతి, దిగుమతుల రవాణాకు ఇది ఎంతో తోడ్పడుతుంది.

ఎల్ నినో వచ్చినా నో టెన్షన్: రేవంత్!

- ఎల్ నినో వచ్చినా ఆహార కొరత ఉండదు
- పౌల్ట్రీ రంగానికి ప్రభుత్వ అండ 2 లో
- ఫ్యూచర్ సిటీలో పౌల్ట్రీ కన్వెన్షన్ సెంటర్
- సింగిల్ విండోతో పరిశ్రమలకు వేగంగా అనుమతులు
- రాష్ట్రంలో రోజుకు 5.3 కోట్ల గుడ్ల ఉత్పత్తి
- రెండేళ్లకు సరిపడా సన్నబియ్యం నిల్వలు
- పాత పాలసీలను కొనసాగిస్తున్న తెలంగాణ ప్రభుత్వం
- 2047 నాటికి జీడీపీలో తెలంగాణ వాటా 10 శాతం
- తెలంగాణను దేశానికి రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతాం

Registered No : APTEL/25/A0818
ఇది కద నిజం
గురువారం 24-11-2026

ఎల్ నినో వచ్చినా నో టెన్షన్: రేవంత్!

న్యూస్ డెస్క్, 25 నవంబర్ (ఇది కద నిజం): ఫ్యూచర్ సిటీలో పౌల్ట్రీ కన్వెన్షన్ సెంటర్ నిర్మాణానికి ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని, ఇందుకు అవసరమైన భూకేటాయింపులపై త్వరలో జరగనున్న 'గ్లోబల్ సిటీ సమ్మిట్'లో తుది నిర్ణయం తీసుకుంటామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీ వేదికగా బుధవారం ప్రారంభమైన 18వ 'పౌల్ట్రీ ఇండియా ఎక్స్‌పో'కు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. మూడు రోజుల పాటు జరగనున్న ఈ అంతర్జాతీయ సదస్సుకు దేశ, విదేశాల నుంచి భారీగా ప్రతినిధులు హాజరయ్యారు.

పౌల్ట్రీ రంగానికి అండగా ప్రభుత్వం

ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. పౌల్ట్రీ రంగాన్ని కేవలం వ్యాపారంగా కాకుండా, సమాజానికి అవసరమైన ప్రొటీన్ అందించే కీలక పరిశ్రమగా (ప్రొటీన్ ఇండస్ట్రీ) తమ ప్రభుత్వం చూస్తోందన్నారు. ఈ పరిశ్రమలో ధరల్లో హెచ్చుతగ్గులు సహజమని, సంక్షోభ సమయాల్లో పౌల్ట్రీ రంగానికి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. పౌల్ట్రీ పరిశ్రమల ఏర్పాటుకు సింగిల్ విండో విధానం ద్వారా వేగంగా అనుమతులు మంజూరు చేస్తామని, రంగంలో ఎదురయ్యే సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. హైదరాబాద్‌లో 18 ఏళ్లుగా పౌల్ట్రీ మీట్‌ను విజయవంతంగా నిర్వహించడం గొప్ప విషయమని అభినందించారు.

ఎల్‌నినో ఉన్నా ఆహారానికి కొరత లేదు

ఎల్ నినో ప్రభావం ఉన్నప్పటికీ రాష్ట్రంలో ఆహార ధాన్యాలకు ఎలాంటి కొరత లేదని, ప్రజలకు ఎలాంటి తిప్పలు ఉండవని సీఎం స్పష్టం చేశారు. రాష్ట్రంలో రెండేళ్లకు సరిపడా సన్నబియ్యం నిల్వలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రాష్ట్రంలో ప్రతిరోజూ 5.3 కోట్ల గుడ్ల ఉత్పత్తి జరుగుతోందని, పౌల్ట్రీ పరిశ్రమ సహకారంతో ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లోని పేద విద్యార్థులకు పౌష్టిక ఆహారంగా గుడ్లను పంపిణీ చేయగలుగుతున్నామని పేర్కొన్నారు. పౌల్ట్రీ రంగం ద్వారా రైతులకు కూడా పరోక్షంగా ఎంతో సహకారం అందుతోందన్నారు.

పక్క రాష్ట్రాల్లా మేం పాలసీలు మార్చం

గతంలో ఉమ్మడి రాష్ట్రంలో ముఖ్యమంత్రులుగా పనిచేసిన చంద్రబాబు నాయుడు, వైఎస్ రాజశేఖరరెడ్డి పౌల్ట్రీ రంగానికి ఎంతో మేలు చేసే మంచి పాలసీలు రూపొందించారని సీఎం గుర్తుచేశారు. ఆ తర్వాత వచ్చిన ముఖ్యమంత్రులు తెచ్చిన మంచి పాలసీలను కూడా తమ ప్రభుత్వం కొనసాగిస్తోందని చెప్పారు. పక్క రాష్ట్రాల్లో ప్రభుత్వాలు మారినప్పుడల్లా పాలసీలు మారుతున్నాయి. కానీ తెలంగాణలో ఏ ప్రభుత్వం మంచి పాలసీ తెచ్చినా మేం వాటిని రద్దు చేయలేదు, ఎలాంటి మార్పులు చేయకుండా కొనసాగిస్తున్నామన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 'వికసిత్ భారత్-2047' లక్ష్యంతో పనిచేస్తున్నారని, ఆ లక్ష్య సాధనలో తెలంగాణ కూడా క్రియాశీలక పాత్ర పోషిస్తుందని రేవంత్ రెడ్డి తెలిపారు. 2047 నాటికి దేశ జీడీపీలో తెలంగాణ వాటా 10 శాతం ఉండేలా తమ ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా పనిచేస్తోందన్నారు. రాబోయే రోజుల్లో అన్ని రంగాల్లో తెలంగాణను దేశానికే ఒక 'రోల్ మోడల్'గా తీర్చిదిద్దుతామని సీఎం ధీమా వ్యక్తం చేశారు.

మేం బిచ్చగాళ్లం కాదు: కాంగ్రెస్ ఆగ్రహం!

మొదటి పేజీ తరువాయి

మేం బిచ్చగాళ్లం కాదు:

తాజా పరిణామాలపై కాంగ్రెస్ యూపీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎంపీ ఇమ్రాన్ మసూద్ బుధవారం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పొత్తు విషయంలో అఖిలేష్ యాదవ్ నేతృత్వంలోని ఎస్పీకి చిత్తశుద్ధి లేదని విమర్శించారు. ఒకవైపు చర్చలు పూర్తి కాకముందే అభ్యర్థులను ఎలా ప్రకటిస్తారు? మేమేమీ బిచ్చగాళ్లం కాదు, అఖిలేష్ యాదవ్ వేసే భిక్ష కోసం ఎదురుచూడటం లేదు. మమ్మల్ని ఇలా ఎలా అవమానిస్తారు? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము కూడా అవే స్థానాల్లో అభ్యర్థులను నిలబెట్టగలమని హెచ్చరించారు. దీంతో ఎస్పీ బీజేపీతో పోరాడాలనుకుంటోందా లేక మాతో పోరాటం చేయాలనుకుంటోందా అనేది అర్థం కావడం లేదన్నారు. ఎస్పీ ముందు ఎవరితో పోరాటం చేయాలనుకుంటుందో తేల్చుకోవాలన్నారు.

26 సీట్ల ఆఫర్‌పై మండిపాటు

ఢిల్లీలో జరిగిన చర్చల్లో మొత్తం 403 అసెంబ్లీ స్థానాలకు గాను 26 సీట్లను ఎస్పీ తమకు ప్రాథమికంగా ప్రతిపాదించిన కొన్ని గంటల్లోనే అభ్యర్థుల జాబితాను ప్రకటించడంపై మసూద్ ఘాటుగా రియాక్ట్ అయ్యారు. మేం కూటమిలో భాగంగా ఢిల్లీలో చర్చలు జరుపుతున్నాం. ఆ సమావేశాల తర్వాత '26 సీట్ల నుంచి మొదలుపెడదాం' అని ప్రకటనలు చేస్తున్నారు. అసలు మేం మిమ్మల్ని 26 సీట్లు అడగనే లేదన్నారు. కాగా మంగళవారం సాయంత్రం ఎస్పీ విడుదల చేసిన ఐదుగురు అభ్యర్థుల జాబితాలో బెహత్ (ఉమర్ అలీ ఖాన్), సహారన్‌పూర్ (ఆశు మాలిక్), కైరానా (నహిద్ హసన్), అమ్రోహా (మెహబూబ్ అలీ), లలిత్‌పూర్ (జ్యోతి లోధి) స్థానాలు ఉన్నాయి. ఇందులో బెహత్, సహారన్‌పూర్ నియోజకవర్గాలు కాంగ్రెస్ ఆశించిన 181 స్థానాల జాబితాలో ఉన్నట్లు సమాచారం.

ఎస్పీకి బీహార్ భయం!

కాగా ఓ వైపు సీట్ల సర్దుబాటుపై చర్చలు కొనసాగుతున్న తరుణంలోనే ఎస్పీ దుందుడుకుగా వ్యవహరించడం వెనుక బిహార్ భయం ఉందా అనే అనుమానాలు రాజకీయ వర్గాల్లో వ్యక్తం అవుతోంది. బిహార్ అసెంబ్లీకి జరిగిన గత ఎన్నికల్లో ఆర్జేడీ, కాంగ్రెస్ పొత్తు సత్ఫలితాలు ఇవ్వలేదు. ఎన్నికలకు ముందు వాతావరణం అంతా తమకే అనుకూలంగా ఉందని కానీ కాంగ్రెస్?తో కలిసి ఎన్నికలకు వెళ్లడం వల్ల తమకు బాగా డ్యామేజ్ అయిందనే వాదన ఆర్జేడీలో వినిపించింది. యూపీలోను ఇదే జరగబోతోందని కాంగ్రెస్ తో పొత్తు పెట్టుకుంటే లేని పోని ఇబ్బందులు తప్పవనే వాదన ఎస్పీలోనూ వినిపిస్తోంది. పొత్తు వల్ల అంతిమంగా బీజేపీకి లబ్ధి చేకూరుతుందనే టాక్ వినిపిస్తోంది. ఇటువంటి పరిస్థితుల్లో అఖిలేశ్ యాదవ్ పార్టీ స్పీడ్ వెనుక బిహార్ ఫలితాల ఎఫెక్ట్ ఏమైనా ఉందా? అసలు ఎన్నికల సమయానికి ఇండియా కూటమిలో ఏం జరగబోతోంది అనేది ఉత్కంఠగా మారింది.

చేయూత పింఛన్లకు నేడే శ్రీకారం!

మొదటి పేజీ తరువాయి



అందులో ప్రభుత్వ ఉద్యోగుల కుటుంబాలకు చెందిన వారు, రాజకీయ నేతల ఫ్యామిలీ మెంబర్లు, 10 ఎకరాల పైన ఉన్న రైతులు, ఐటీ చెల్లిస్తున్న వారు, కార్లు ఉన్న వారు కూడా దరఖాస్తులు చేశారు. ఆ దరఖాస్తులను క్షేత్ర స్థాయిలో పక్కన పెడితే విమర్శలు వస్తాయనే ఉద్దేశంతో రాష్ట్ర స్థాయిలో స్క్రూట్నీ చేశారు. అందుకోసం ప్రభుత్వం వద్దనున్న ప్రత్యేక సాఫ్ట్‌వేర్ ఆధారంగా 360 డిగ్రీస్‌లో వడపోసి 4.72 లక్షల మందిని గుర్తించారు. వీరందరికీ ఇప్పటికే సాంక్షన్ లెటర్లను స్థానిక మంత్రులు, ఎమ్మెల్యేలు అందించారు. ఈనెల 26న అచ్చంపేటలో సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి నగదును బదిలీ చేయనున్నారు. సీఎం బటన్ నొక్కగానే కొత్త లబ్ధిదారుల అకౌంట్లోకి ఒకేసారి డబ్బులు జమ అయ్యేలా పంచాయతీ రాజ్ శాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు.

అర కోటి మందికిపైగా ప్రయోజనం

ప్రతినెలా చేయూత స్కీం కింద 46.39 లక్షల మందికి పెన్షన్లు ఇస్తున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత వృద్ధాప్య పెన్షన్లు తీసుకుంటున్న 1.25 లక్షల మంది చనిపోతే వారి కుటుంబంలోని వృద్ధులకు పెన్షన్లను మంజూరు చేశారు. తాజాగా వికలాంగులు, పైలేరియా, ఏయిడ్స్, డయాలసిస్ బాధితులు, సింగిల్ ఉమెన్, విడోస్‌లను కలుపుకుని కొత్తగా 4.72 లక్షల మందికి పెన్షన్లను మంజూరు చేశారు. దీంతో ప్రతినెలా 52 లక్షల మందికి పైగా ప్రభుత్వం నుంచి ఆర్థిక ప్రయోజనం పొందనున్నారు. అందుకోసం ప్రభుత్వానికి ప్రతి నెలా రూ.1,100 కోట్ల వరకు ఖర్చుపుతుందని ఆర్థిక శాఖ వర్గాలు వెల్లడించాయి.

కోటి మందికి చీరల పంపిణీ

అచ్చంపేట వేదికగానే సీఎం రేవంత్ రెడ్డి కోటి మంది మహిళలకు ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. ఆ రోజు నుంచి ప్రతి గ్రామంలో రేషన్ షాపుల వద్ద మహిళలకు చీరలను పంచేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రెండోసారి మహిళలకు చీరలను కానుకగా ఇస్తున్నది. గ్రామీణ ప్రాంతాల్లో 65 లక్షల మంది, పట్టణ ప్రాంతాల్లో 35 లక్షల మంది మహిళలు ప్రయోజనం పొందనున్నారు. రేషన్ కార్డు కలిగిన కుటుంబాల్లో 18 ఏండ్లు నిండిన మహిళలందరికీ ఇందిరమ్మ చీరలను పంపిణీ చేయనున్నారు.

దేశ రాజధానిలో ఘోరం..

22 ఏళ్ల యువతిపై అఘాయిత్యం!

మొదటి పేజీ తరువాయి

బాధిత యువతి, నిందితులు అందరూ ప్రీత్ విహార్‌లోని సల్తనత్ కేఫ్‌లోనే ఉద్యోగులుగా పనిచేస్తున్నారు. సోమవారం రాత్రి కేఫ్‌లో సహోద్యోగులందరూ కలిసి పార్టీ చేసుకున్నారు.

రాత్రి 11:30 గంటల తర్వాత కూడా కొనసాగిన ఈ పార్టీ, తెల్లవారుజామున 3:30 గంటలకు ముగిసింది. పార్టీ ముగిసిన తర్వాత తన సహోద్యోగులతో ఇద్దరు తనపై అత్యాచారానికి పాల్పడ్డారని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న ప్రీత్ విహార్ పోలీసులు, నేరానికి సహకరించిన వారితో కలిపి మొత్తం ఆరుగురిపై వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఇప్పటివరకు ఇద్దరు మహిళలు సహా ముగ్గురు నిందితులను అరెస్ట్ చేయగా, పరారీలో ఉన్న మిగిలిన నిందితుల కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు.

తెలంగాణకు వర్షాల అలర్ట్!

న్యూస్ డెస్క్, 25 నవంబర్ (ఇది కద నిజం): బంగాళాఖాతంలో ఏర్పడిన ద్రోణి ప్రభావంతో తెలంగాణ రాష్ట్రంలో రానున్న కొద్దిరోజులు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. నవంబర్ 24 నుంచి 27 వరకు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే సూచనలు ఉన్నాయని అధికారులు తెలిపారు. వాతావరణ శాఖ వివరాల ప్రకారం.. నవంబర్ 24న ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, సూర్యాపేట, వనపర్తి, నాగర్‌కర్నూల్, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఆ తర్వాత నవంబర్ 25 నుంచి 27 వరకు హైదరాబాద్ నగరంతో పాటు రాష్ట్రంలోని పలు ఇతర ప్రాంతాల్లో తేలికపాటి వర్షాలు లేదా చినుకులు పడే అవకాశం ఉందని పేర్కొంది.

పొగమంచుతో ప్రయాణికులకు సూచనలు..

ఈ వాతావరణ మార్పుల నేపథ్యంలో ఉదయాన్నే పొగమంచు దట్టంగా కమ్మేసే అవకాశం ఉంది. పొగమంచు కారణంగా రహదారులపై దృశ్యమానత తగ్గుతుందని, అందువల్ల తెల్లవారుజాము, ఉదయం వేళల్లో ప్రయాణించే వాహనదారులు, ప్రయాణికులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. వర్షాల అనంతరం వాతావరణంలో మార్పులు చోటుచేసుకుని, నవంబర్ 29 నుంచి రాష్ట్రంలో చలి తీవ్రత క్రమంగా పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది. రాత్రి, తెల్లవారుజాము వేళల్లో ఉష్ణోగ్రతలు తగ్గే సూచనలు ఉన్నందున ప్రజలు, ముఖ్యంగా వృద్ధులు, చిన్నారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు.

కవితపై మాట దొర్లింది.. సీతక్క వివరణ!

న్యూస్ డెస్క్, 25 నవంబర్ (ఇది కద నిజం): తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితపై తాను చేసిన వ్యాఖ్యల విషయంలో పొరపాటు జరిగిందని ఇందుకు చింతిస్తున్నట్లు మంత్రి సీతక్క తెలిపారు. సోషల్ మీడియాలో తనపై జరుగుతున్న తప్పుడు ప్రచారాన్ని రాష్ట్ర మంత్రి సీతక్క తీవ్రంగా ఖండించారు. నిన్న ములుగులో చేయూత పెన్షన్ల పంపిణీ అనంతరం మీడియాతో మాట్లాడే క్రమంలో కవిత మాటలను ప్రస్తావిస్తూ తాను ఉపయోగించిన ఒక పదంపొరపాటున దొర్లిందని స్పష్టం చేశారు. కవితను ఉద్దేశించి తాను కావాలని ఆ మాట అనలేదని, వెంటనే ఆ వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని సరిదిద్దుకున్నప్పటికీ బీఆర్ఎస్ శ్రేణులు కావాలనే ఆ వీడియోను వైరల్ చేస్తూ ట్రోల్ చేయడం దుర్మార్గమని సీతక్క మండిపడ్డారు. ఈ మేరకు ఆమె ఓ వీడియోను రిలీజ్ చేశారు.

అక్కసుతోనే..

నాకు క్యాన్సర్ ఉందనే విషయాన్ని ఓ ఇంటర్వ్యూలో కవిత స్వయంగా చెప్పిన విషయాన్ని ప్రస్తావించే క్రమంలో మాట దొర్లిందని మంత్రి వివరణ ఇచ్చారు. వరంగల్ పర్యటనలో పెన్షన్లపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన తప్పుడు ప్రచారాన్ని తాను గట్టిగా తిప్పికొట్టాననే అక్కసుతోనే ఇప్పుడు తన మాటలను వక్రీకరిస్తూ దుష్ప్రచారం చేస్తున్నారని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను రాజకీయ ప్రత్యర్థులను ఎప్పుడూ సిద్ధాంతపరంగా, రాజకీయంగానే ఎదుర్కొంటానని సీతక్క తేల్చి చెప్పారు. వ్యక్తిగత విమర్శలు చేయడం తన నైజం కాదని రాష్ట్ర ప్రజలకు కూడా బాగా తెలుసని ఆమె వ్యాఖ్యానించారు.

కార్తీక దీపంపై వివాదం.. విజయ్ ప్రభుత్వంపై ఫైర్!



న్యూస్ డెస్క్, 25 నవంబర్ (ఇది కద నిజం): దేశవ్యాప్తంగా తిరుప్పరంకుండ్రం కార్తీక దీపంపై తీవ్ర చర్చ జరుగుతోంది. సుప్రీం, హైకోర్టు ఆదేశాలు ఉన్నప్పటికి మదురై సమీపంలోని తిరుప్పరంకుండ్రం కొండపై ఉన్న రాతి స్తంభానికి దీపం వెలిగించకపోవడంతో తమిళ ప్రజలతో పాటు హిందూ సంఘాలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నాయి. రాతి స్తంభంపై దీపం వెలిగించాలని సుప్రీంకోర్టు, హైకోర్టు ఆదేశాలు జారీ చేసినప్పటికీ తమిళనాడు ప్రభుత్వం వాటిని పట్టించుకోకపోవడంపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది.

న్యాయస్థానాల ఆదేశాలను అమలు చేయకపోవడం స్పష్టంగా కోర్టు ధిక్కరణ కిందకు వస్తుందని హిందూ సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఈ వ్యవహారంలో విజయ్ ప్రభుత్వంపై కఠిన చర్యలు తీసుకోవాలని అవి డిమాండ్ చేస్తున్నాయి. మరోవైపు ఈ విమర్శలపై తమిళగ వెట్రి కళగం సపోర్టర్లు స్పందిస్తూ.. న్యాయస్థానం ఇచ్చింది కేవలం మధ్యంతర ఉత్తర్వులు మాత్రమేనని, ఆ ఆదేశాలపై ప్రభుత్వం ఇప్పటికే రివ్యూ పిటిషన్ దాఖలు చేసిందని స్పష్టం చేస్తున్నారు. ఏది ఏమైనప్పటికి తిరుప్పరంకుండ్రం కార్తీక దీపం ప్రస్తుతం దేశ వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

ఎమ్మెల్సీ ఓటర్ల జాబితా.. డిసెంబర్ 10 వరకు ఛాన్స్!

న్యూస్ డెస్క్, 25 నవంబర్ (ఇది కద నిజం): తెలంగాణ శాసనమండలిలోని రెండు పట్టభద్రుల నియోజకవర్గాల ఎన్నికలకు సంబంధించి నూతన ఓటర్ల జాబితా ముసాయిదాను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి బుధవారం విడుదల చేశారు. నవంబర్ 1 అర్హత తేదీగా రూపొందించిన ఈ జాబితాను సంబంధిత అధికారుల కార్యాలయాలు, అలాగే సీఈఓ అధికారిక వెబ్‌సైట్ ceotelangana.nic.inలో అందుబాటులో ఉంచారు.

ముసాయిదా ఓటర్ల వివరాలు ఇలా..

మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ ఎమ్మెల్సీ ఎస్.వాణీ దేవి, వరంగల్-ఖమ్మం-నల్గొండ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నల పదవీకాలం 2027 మార్చి 29తో ముగియనున్న నేపథ్యంలో ఈ కొత్త ఓటర్ల జాబితా ప్రక్రియను చేపట్టారు. రెండు నియోజకవర్గాల పరిధిలో కలిపి మొత్తం 11,89,191 మంది పట్టభద్రులు ముసాయిదా జాబితాలో ఉన్నారు. వాటిలో మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ పరిధిలో 5,68,105 మంది, వరంగల్-ఖమ్మం-నల్గొండ పరిధిలో 6,21,086 మంది ఓటర్లు ఉన్నారు. రెండు నియోజకవర్గాల్లో మొత్తం 1,703 పోలింగ్ కేంద్రాలను ఈసీ ఆమోదించింది.

అభ్యంతరాల స్వీకరణ, కొత్త దరఖాస్తుల షెడ్యూల్ ఇదే

ఇది పూర్తిగా కొత్తగా రూపొందిస్తున్న జాబితా కావడంతో పాత ఓటర్ల పేర్లు ఆటోమేటిక్‌గా కొనసాగవని అధికారులు స్పష్టం చేశారు. అభ్యంతరాలు, క్లెయిమ్‌లను నవంబర్ 25 నుంచి డిసెంబర్ 10 వరకు స్వీకరిస్తారు. నవంబర్ 1 నాటికి కనీసం మూడేళ్ల ముందు డిగ్రీ ఉత్తీర్ణులైన వారి పేరు లేకపోతే ఫారం-18 ద్వారా డిసెంబర్ 10 వరకు, తుది జాబితా డిసెంబర్ 30, 2026 తర్వాత నామినేషన్ల చివరి తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇక పేర్ల తొలగింపు అభ్యంతరాలకు ఫారం-7, సవరణలకు ఫారం-8 ఉపయోగించాలని, అర్హులైన పట్టభద్రులు తమ పేర్లను సరిచూసుకోవాలని సీఈఓ సదర్శన్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

డ్రగ్స్‌పై సమరానికి కిషన్ రెడ్డి శ్రీకారం!

మొదటి పేజీ తరువాయి

పాదయాత్ర ప్రారంభానికి ముందు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అంబర్‌పేటలోని శ్రీ మహంకాళి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అంబర్‌పేట గ్రౌండ్‌లో జెండా ఊపి పాదయాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా ర్యాలీలో పాల్గొన్న వారందరితో డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు.

డ్రగ్స్ రహిత భారత్ ప్రధాని సంకల్పం: కిషన్ రెడ్డి

ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. దేశాన్ని 'నషా ముక్త్ భారత్' (మత్తు రహిత భారత్)గా తీర్చిదిద్దాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సంకల్పించారని తెలిపారు. డ్రగ్స్ పేరుతో దేశద్రోహులు మన పిల్లల భవిష్యత్తును నాశనం చేస్తున్నారని, వారిని మత్తుకు బానిసలుగా చేసి కుటుంబానికి, సమాజానికి దూరం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు, యువతలో డ్రగ్స్ దుష్ప్రభావాలపై అవగాహన కల్పించడమే ఈ పాదయాత్ర ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. యువత భవిష్యత్తును కాపాడే ఈ మహా సంకల్పంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సినీ నటుడు విక్టరీ వెంకటేశ్ రాకతో డ్రగ్స్‌పై తాము చేస్తున్న ఈ ఉద్యమం కచ్చితంగా విజయం ('విక్టరీ') సాధిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

'నో టు డ్రగ్స్.. యెస్ టు లైఫ్': నటుడు వెంకటేశ్

కార్యక్రమంలో పాల్గొన్న సినీ నటుడు వెంకటేశ్ యువతను ఉద్దేశించి మాట్లాడుతూ.. యువత చెడు అలవాట్లకు, డ్రగ్స్‌కు పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు. ఉజ్వల భవిష్యత్తు కోసం "నో టు డ్రగ్స్.. యెస్ టు లైఫ్" (డ్రగ్స్‌కు నో చెప్పండి.. జీవితానికి యెస్ చెప్పండి) అనే నినాదాన్ని ప్రతి ఒక్కరూ పాటించాలని పిలుపునిచ్చారు.

కేంద్ర కేబినెట్ కీలక ముద్ర!

మొదటి పేజీ తరువాయి

నిర్మాణ సమయంలో సుమారు 750 మందికి, నిర్వహణ దశలో సుమారు 800 మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయి. డ్రెడ్జింగ్ కోసం కామరాజర్ పోర్ట్ మరో రూ. 450 కోట్లు భరించనుంది.

అసోంలోని కచార్ జిల్లాలో బరాక్ లోయకు గుండెకాయ లాంటి దోలూ వద్ద రూ. 2,014 కోట్లతో గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయాన్ని అభివృద్ధి చేయనున్నారు. 12,351 చదరపు మీటర్ల విస్తీర్ణంలో పీక్ అవర్‌లో 800 మంది ప్రయాణికులకు సేవలందించేలా టెర్మినల్ భవనం, ఏ-320 విమానాలు నడిచేందుకు అనువైన 2,705 మీటర్ల రన్‌వే, 6 విమానాల పార్కింగ్ సామర్థ్యంతో ఆప్రాన్ నిర్మిస్తారు. తేయాకు తోటలు, పర్యాటకం, వాణిజ్యానికి ఇది ఊతమిచ్చి ఈశాన్య భారతాన్ని మరింత అనుసంధానిస్తుంది.

వీటితో పాటు నిర్మాణ, మౌలిక సదుపాయాల పరికరాల తయారీ పర్యావరణ వ్యవస్థ కోసం రూ. 11,000 కోట్ల పథకానికి కూడా క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఎనిమిదేళ్ల పాటు అమలయ్యే ఈ పథకం ద్వారా షిప్-టు-షోర్ క్రేన్లు, టన్నెల్ బోరింగ్ మెషీన్లు, హైడ్రాలిక్ ఎక్స్‌కవేటర్లు వంటి అత్యాధునిక పరికరాల దేశీయ తయారీని ప్రోత్సహించడంతో పాటు ప్రత్యేక పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేస్తారు. 2024-25లో సుమారు రూ. 97,500 కోట్లుగా ఉన్న భారత సీఐఈ పరిశ్రమ 2029-30 నాటికి రూ. 2,28,100 కోట్లకు చేరుతుందని అంచనా. అలాగే తపాలా శాఖ పరిధిలోని పోస్టల్ ఆపరేషన్స్ పథకానికి రూ. 1,141 కోట్లు, ఎస్టేట్స్ మేనేజ్‌మెంట్ పథకానికి రూ. 1,491 కోట్ల కేటాయింపులకు కేంద్ర మంత్రివర్గం ఆమోద ముద్ర వేసింది.

బీఆర్ఎస్ అంతం తప్పదు..

న్యూస్ డెస్క్, 25 నవంబర్ (ఇది కద నిజం): త్వరలో బీఆర్ఎస్ కొట్టుకుపోతుందంటూ బీఆర్ఎస్ అధినేత్రి కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. ఓ మీడియా ఛానల్‌లో ఆమె మాట్లాడుతూ.. బీఆర్ఎస్ నేతలు తనపై దాడి చేస్తున్నారని చెప్పారు. తనను వ్యక్తిగతంగా టార్గెట్ చేస్తున్నారని, అలా చేస్తే ఏం వస్తుందని ప్రశ్నించారు. బీఆర్ఎస్ పార్టీకి ఆదరణ పెరుగుతుందనే భయంతోనే తనను టార్గెట్ చేస్తున్నారని అన్నారు. తనను ఇంటి నుండి వెళ్లగొట్టారని, ఇంకా ఏం సాధిస్తారని ప్రశ్నించారు. త్వరలోనే బీఆర్ఎస్ కొట్టుకుపోవడం ఖాయం అని అన్నారు.

నాగార్జున సాగర్ నుండి ఏపీకి నీళ్లు తరలించడాన్ని అందరూ ఐక్యంగా వ్యతిరేకించాల్సిందేనని స్పష్టం చేశారు. ఇక ఇటీవల సైతం ఓ ఇంటర్వ్యూలో కవిత షాకింగ్ కామెంట్లు చేసిన సంగతి తెలిసిందే. తనకు క్యాన్సర్ ఉందని, త్వరలోనే చనిపోతానని సైతం కేటీఆర్ తనపై ప్రచారం చేయించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తన నియోజకవర్గం అభివృద్ధి కోసం కేసీఆర్ వద్దకు వెళ్లినా ఆయన పట్టించుకోలేదని చెప్పారు.

కాళేశ్వరంపై సర్కార్ కొరడా!

మరమ్మతుల ఖర్చును కూడా వాటి నుంచే రాబట్టాలనే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది.

రిపేర్లకు రూ.4,200 కోట్లు!: కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలకు మరమ్మతులు చేపట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. ముఖ్యంగా మేడిగడ్డ బ్యారేజీలోని ఏడో బ్లాక్‌లో పిల్లర్లు కుంగిపోవడం, నిర్మాణానికి తీవ్ర నష్టం వాటిల్లడంతో ప్రాజెక్టు భద్రతపై అనేక ప్రశ్నలు తలెత్తాయి. మరోవైపు అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లోనూ సమస్యలు వెలుగుచూడటంతో సమగ్ర మరమ్మతుల అవసరం ఏర్పడింది. ఈ పనులన్నింటికీ కలిపి సుమారు రూ.4,200 కోట్ల వరకు ఖర్చవుతుందని అంచనాలు రూపొందినట్టు సమాచారం. ఇంత భారీ మొత్తాన్ని ప్రభుత్వ ఖజానా నుంచి వెచ్చించడంపై సర్కార్ ఆచితూచి వ్యవహరిస్తోంది. తప్పు చేసిన వారే నష్టాన్ని భరించాలనే వాదనకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలుస్తోంది. బ్యారేజీల నిర్మాణంలో భాగస్వాములైన ఏజెన్సీలపై బాధ్యతను నిర్ధారించడం ఇప్పుడు ప్రభుత్వానికి సవాల్‌గా మారింది. అగ్రిమెంట్‌లో ఉన్నప్పుడే బ్యారేజీలు కుంగుబాటుకు గురికావడంతో ఆ ఖర్చును సంస్థలే భరించాలని ప్రభుత్వం చెబుతూ వస్తోంది.

అగ్రిమెంటులోకి వచ్చే మరమ్మతులను కంపెనీల ద్వారానే చేయించాలని ప్రభుత్వం భావిస్తున్నది. అగ్రిమెంట్లోకి రాని వాటికి ప్రభుత్వం ఖర్చు భరించేందుకు సిద్ధం అవుతున్నట్టు తెలిసింది. అయితే, మరమ్మతుల ఖర్చును తామెందుకు భరించాలని, తమపై మొత్తం బాధ్యత మోపడం సరికాదనే ధోరణితో నిర్మాణ సంస్థలు వ్యవహరిస్తున్నట్టు సమాచారం. నిర్మాణ లోపాలు, డిజైన్లు, నాణ్యతా ప్రమాణాలు, పర్యవేక్షణ వంటి అంశాలను ప్రస్తావిస్తూ బాధ్యతను తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నాయనే చర్చ సాగుతోంది. బ్యారేజీల నిర్మాణం సందర్భంగా తీసుకున్న బాధ్యతలు, ఒప్పంద నిబంధనలు, నిర్మాణ నాణ్యతపై వచ్చిన ఆరోపణలను పరిశీలించకుండా ప్రభుత్వం వెనక్కి తగ్గే పరిస్థితి లేదని తెలుస్తోంది. కాంట్రాక్ట్ సంస్థలు ఖర్చు భరించేందుకు ముందుకు రాకపోవడంతో ప్రభుత్వం ఈ అంశాన్ని రాజకీయంగా, చట్టపరంగా బలంగా ముందుకు తీసుకెళ్లాలని భావిస్తున్నట్టు సమాచారం.

అసెంబ్లీలోనే తేల్చేయాలని..!: ఏజెన్సీల నుంచి మరమ్మతుల ఖర్చును రాబట్టే అంశాన్ని ప్రభుత్

Registered No : APTEL/25/A0818
ఇది కద నిజం
గురువారం 25-11-2026

పట్టభద్రుల ఓటు నమోదుపై అవగాహన, ప్రచార కార్యక్రమం





ఇది కద నిజం :దొంగ ఓటు వేయడం సమాజానికి ఎంత ప్రమాదకరమో, పట్టభద్రులు తమ ఓటు హక్కును అశ్రద్ధ చేయడం కూడా అంతే ప్రమాదకరమని తెలంగాణ రక్షణ సేన పార్టీ (తెరాస) రాష్ట్ర యువజన విభాగం నాయకులు పేర్కొన్నారు. పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆదేశాల మేరకు, రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షులు కంచర్ల శివ రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం కూకట్‌పల్లి నియోజకవర్గంలోని వివిధ కళాశాలల్లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా "హైదరాబాద్ – రంగారెడ్డి – మహబూబ్ నగర్" పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికల ఓటరు నమోదు విధానంపై కళాశాలల అధ్యాపకులకు వివరించడంతో పాటు, తెరాస పార్టీ అభ్యర్థి ఆకాష్ కొల్లూరు తరపున ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యువజన విభాగం నిర్వహణ కార్యదర్శి చామర్తి సీతారాం, ఉపాధ్యక్షులు సందీప్, సుకుమార్ రావు మరియు యువజన విభాగం కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంటర్ బోర్డును ఏకపక్షంగా స్కూల్ ఎడ్యుకేషన్ లో విలీనం చేస్తామంటే ఒప్పుకోం

- విద్యార్థుల తల్లిదండ్రులు, స్కూళ్లు, కాలేజీల యాజమాన్యాలు, విద్యావేత్తలతో చర్చించిన తర్వాతే నిర్ణయం తీసుకోవాలి
- రాష్ట్రాన్ని కరువు బారి నుంచి బయట పడేసేందుకు కేంద్రం సాయం చేయాలి
- తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత
- నిజామాబాద్ లోని శ్రీ నీలకంఠేశ్వర ఆలయంలో స్వామి వారికి అభిషేకం, ప్రత్యేక పూజలు



ఇది కద నిజం ,నిజామాబాద్ : ఇంటర్ విద్యను ఏకపక్షంగా స్కూల్ ఎడ్యుకేషన్ లో విలీనం చేస్తామంటే ఎట్టి పరిస్థితుల్లో అంగీకరించేది లేదని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల స్పష్టం చేశారు. ఈ అంశంలో కచ్చితంగా విద్యార్థుల తల్లితండ్రులు, స్కూల్ యాజమాన్యాలు, ఇంటర్ కాలేజ్ ల యాజమాన్యాలు, విద్యావేత్తలతో చర్చించాకే నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వానికి సూచించారు. బుధవారం నిజామామాబాద్ లోని పార్టీ కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడారు. ఇంటర్ విద్య విషయంలో నెలకొన్న అన్ని సందేహాలను ప్రభుత్వం నివృత్తి చేయాల్సిందేనని డిమాండ్ చేశారు. స్కూల్ ఎడ్యుకేషన్ లో ఇంటర్ విద్యను విలీనం చేస్తే మౌలిక సదుపాయాలు ఎలా కల్పిస్తారని ప్రశ్నించారు. ఇంటర్ లో స్కూల్ ఎడ్యుకేషన్ ను కలుపుతారా? స్కూల్ ఎడ్యుకేషన్ ను ఇంటర్ లో కలుపుతారా స్పష్టత ఇవ్వాలన్నారు. ఇప్పటికే ఇంటర్మీడియేట్ విద్య కోసం తల్లితండ్రులు లక్షలు ఖర్చు చేస్తున్నారని.. కొత్తగా 9, 10 తరగతులను కూడా కలిపితే భారీగా ఫీజుల భారం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ విద్యను సమాంతరంగా ప్రోత్సహించకుండా, ఫీజుల నియంత్రణ చేపట్టకుండా స్కూల్ ఎడ్యుకేషన్ ఇంటర్ విద్యను కలిపితే చాలా ఇబ్బందులుంటాయన్నారు. ఈ అన్ని అంశాలపై ప్రభుత్వం ముందు స్పష్టత ఇవ్వాలని కోరారు. ఏకపక్షంగా ముందుకు వెళ్తామంటే ఎట్టి పరిస్థితుల్లో అంగీకరించేది లేదని తేల్చిచెప్పారు.

రాష్ట్రానికి కేంద్రం కరువు సాయం చేయాలి

కరువు బారిన పడిన రాష్ట్రాన్ని ఆదుకునేందుకు కేంద్రం సాయం చేయాలని డిమాండ్ చేశారు. ఇందుకోసం రాష్ట్ర బీజేపీ ఎంపీలు కేంద్రంపై ఒత్తిడి తేవాలన్నారు. కరువు బారిన పడ్డ రాష్ట్రాన్ని ఆదుకోవాల్సిన ఈ సమయంలో కూడా కేంద్రం నుంచి పైసా సాయం అందడం లేదని మండిపడ్డారు.16 వ ఫైనాన్స్ కమిషన్ నిధులు రాకపోవడంతో సర్పంచులు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. స్థానిక బీజేపీ ఎంపీ అర్వింద్ కేంద్రంతో కొట్లాడి 16 వ ఫైనాన్స్ కమిషన్ నిధులు వచ్చేలా చేయాలని కోరారు. నిజామాబాద్ జిల్లాలో 18 మండలాలను మాత్రమే కరువు మండలాలుగా ప్రకటించడం సరికాదన్నారు. మిగతా అన్ని మండలాల్లోనూ కరువు పరిస్థితులున్నాయని చెప్పారు. రీ సర్వే చేసి కొత్తగా కరువు మండలాల జాబితా ప్రకటించాలని కోరారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ పాదయాత్రలు చేస్తుంటే.. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ సమావేశాలు నిర్వహిస్తోంది.. ఇలా రెండు పార్టీలు ఎవరి డబ్బా వాళ్లే కొట్టుకుంటున్నారని ధ్వజమెత్తారు. ఇకనైనా క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలు తెలుసుకొని వాటి పరిష్కారంపై దృష్టి పెట్టాలని సూచించారు.

రైతులను ఎలా ఆదుకుంటారో చెప్పాలి

కరువు పేరుతో రైతులను పంటలు వేయవద్దని చెబుతున్న ప్రభుత్వం వారిని ఎలా ఆదుకుంటుందో చెప్పాలని కవిత డిమాండ్ చేశారు. ఆరుతడి పంటలు వేస్తే ఎంత ధరకు కొంటారో స్పష్టత ఇవ్వాలన్నారు. ఇప్పటికే యూరియా విషయంలో రైతులను ఆగం చేస్తున్నారని.. మళ్లీ పంటల విషయంలోనూ వారిని గందరగోళానికి గురిచేయడం సరికాదన్నారు. ఇష్టానుసారంగా కరెంట్ కోతలు పెడుతున్నారని.. ఇలాంటి సమయంలో ప్రభుత్వాన్ని నమ్మి రైతులు పంటలు ఎలా వేస్తారని ప్రశ్నించారు. అగ్రికల్చర్ అధికారులు, స్థానిక నాయకులతో సమస్వయం చేసుకొని పంటల విషయంలో రైతులకు ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని ఆమె కోరారు.

శ్రీ నీలకంఠేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

కార్తీక పౌర్ణమి సందర్భంగా బుధవారం తెల్లవారు జామున కంఠేశ్వర్ లోని శ్రీ నీలకంఠేశ్వర స్వామిని కుటుంబ సభ్యులతో కలిసి కవిత దర్శించుకున్నారు. స్వామివారికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, ఏటా కార్తీక పౌర్ణమి రోజు స్వామి వారి దర్శనం.. మరుసటి రోజు శ్రీ నీలకంఠేశ్వర స్వామి వారికి అభిషేకం చేయడం తమ కుటుంబ ఆనవాయితీ అని చెప్పారు. భక్తులకు కొంగు బంగారమైన నీలకంఠేశ్వర ఆలయంలో మరిన్ని అభివృద్ధి పనులు చేయాల్సిన అవసరముందని అర్చకులు తన దృష్టికి తెచ్చారని చెప్పారు. నిజామాబాద్ కోడలిగా ఆలయ అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తానని తెలిపారు. ఆలయ పరిసరాలను శుభ్రంగా ఉంచడాన్ని బాధ్యతగా తీసుకున్న స్థానిక యువతను ఈ సందర్భంగా కవిత ప్రశంసించారు.

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం

నమోదు ప్రక్రియను పరిశీలించిన ఎంఆర్ఓ



ఇది కద నిజం, నవంబర్ 25 ఉమ్మడి నిజామాబాద్ జిల్లా: పిట్లం మండల పరిధిలో కొనసాగుతున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం లబ్ధిదారుల నమోదు ప్రక్రియను ఎంఆర్ఓ మహేందర్ కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా నమోదు వివరాలను అధికారులను అడిగి తెలుసుకొని, అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి పథకం అందేలా పారదర్శకంగా నమోదు ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు.

అర్హులైన ప్రతి కుటుంబానికి బీమా భరోసా అందించడమే లక్ష్యంగా అధికారులు చర్యలు చేపడుతున్నారు.

రాజ్యాధికారంలో ఆడబిడ్డలకు భాగస్వామ్యమే లక్ష్యం

- రేపు తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో మహిళలు – రాజ్యాంగం సదస్సు
- బాగ్ లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సదస్సు
- పాల్గొననున్న వెయ్యి మందికి పైగా మహిళా నాయకులు, కార్యకర్తలు



ఇది కద నిజం ,హైదరాబాద్ :ఆకాశంలో సగమైన ఆడబిడ్డలకు రాజ్యాధికారంలో భాగస్వామ్యం కల్పించడమే లక్ష్యంగా తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత ఆధ్వర్యంలో గురువారం కీలక సదస్సు నిర్వహించనున్నారు. భారత రాజ్యాంగ అవతరణ దినోత్సవం (సంవిధాన్ దివస్) "మహిళలు – రాజ్యాంగం" సదస్సు నిర్వహిస్తున్నారు. బాగ్ లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో గురువారం ఉదయం 11 గంటలకు సదస్సు ప్రారంభమవుతుంది. తెలంగాణ రక్షణ సేన పార్టీకి చెందిన మహిళా నాయకులు, కార్యకర్తలు వెయ్యి మందికి పైగా హాజరుకానున్నారు.

భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75 ఏళ్లు గడిచినా మహిళలకు ఇప్పటికీ రాజ్యాంగ ఫలాలు అందకపోవడం, వివిధ వృత్తుల్లో స్థిరపడిన మహిళలు సైతం ద్వితీయ శ్రేణి, తృతీయ శ్రేణి పౌరులుగా జీవితాలు వెళ్లదీయాల్సిన దుస్థితిలో కొట్టుమిట్టాడుతుండటం సహా మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై సదస్సులో చర్చించనున్నారు. మహిళలకు చట్ట సభల్లో 33 శాతం సీట్లు సాధించుకోవడం మాత్రమే కాదు రాజ్యాధికారంలోనూ అదే దామాషాలో వాటా సాధించడమే ధ్యేయంగా సదస్సు నిర్వహిస్తున్నారు. స్థానిక సంస్థల్లో 50 శాతం రిజర్వేషన్లు మహిళలకు దక్కినా అక్కడా కుటుంబ సభ్యుల నీడలో మహిళలు పదవుల్లో కొనసాగాల్సి రావడంపై చర్చించనున్నారు.

పనిలో.. గనిలో.. ఖార్కానాలో.. సగమైన నారీశక్తికి గౌరవ ప్రదమైన వేతనాలు అందకపోవడం.. పని ప్రదేశాల్లో కొనసాగుతున్న వివక్ష.. ఆడబిడ్డలు అంతరిక్షంలో విహరిస్తున్న రోజుల్లోనూ కొనసాగుతున్న బాల్య వివాహాలు.. అందుకు దారితీస్తున్న పరిస్థితులపైనా సదస్సులో చర్చిస్తారు. తెలంగాణ రక్షణ సేన పార్టీ పార్లమెంట్ నియోజకవర్గాల ఇన్ చార్జీలు, అసెంబ్లీ నియోజకవర్గ ఇన్ చార్జీలుగా ప్రకటించిన మహిళా నాయకులతో పాటు పలువురు సీనియర్ నాయకులు సదస్సులో ప్రసంగిస్తారు. రాజ్యాంగ ఫలాలు మహిళలు అందిపుచ్చుకోవడానికి ఎలాంటి కార్యాచరణ చేపట్టాలి.. తెలంగాణ రక్షణ సేన పార్టీ మహిళలకు రాజ్యాధికారం కోసం ఎలాంటి ప్రణాళికలు అమలు చేయబోతుంది.. ఆడబిడ్డలు, సమాజంలో అట్టడుగున ఉన్న వర్గాలను అందలం ఎక్కించడానికి ఎలా ముందడుగు వేయబోతున్నారు అనే అంశాలపై పార్టీ అధ్యక్షులు కల్వకుంట్ల కవిత కీలకోపన్యాసం చేయనున్నారు. పార్టీకి చెందిన మహిళా నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో ఈ సదస్సు నిర్వహిస్తున్నారు.

షాద్‌నగర్‌లో 495 కుటుంబాలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల మంజూరు పత్రాలు

రెండో విడతలో లబ్ధిదారులకు పంపిణీ చేసిన ప్రజాప్రతినిధులు

షాద్‌నగర్ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్ వైస్ చైర్మన్ అందేమోహన్ చేతుల మీదుగా పత్రాలు పంపిణీ

హాజరైన కౌన్సిలర్లు.



ఇది కద నిజం, షాద్ నగర్....రంగారెడ్డి జిల్లా షాద్ నగర్

సొంతింటి కల నెరవేరుతుందన్న ఆశతో ఎదురుచూస్తున్న పేద కుటుంబాలకు మరో ముందడుగు పడింది షాద్‌నగర్ పట్టణానికి రెండో విడతలో మంజూరైన 495 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు సంబంధించి లబ్ధిదారులకు మంజూరు పత్రాలను పంపిణీ చేశారు రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్ వైస్ చైర్మన్ అందే మోహన్ ముదిరాజ్ తహసీల్దార్ నాగయ్యతో పాటు పలువురు కౌన్సిలర్లు పాల్గొని లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేశారు ఏళ్లుగా సొంతింటి కోసం ఎదురుచూస్తున్న పేద కుటుంబాలకు ఈ పత్రాల పంపిణీ ఆనందాన్ని కలిగించింది అర్హులైన నిరుపేద కుటుంబాలకు గౌరవప్రదమైన నివాస సదుపాయం కల్పించడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశమని ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు మంజూరు పత్రాలు అందుకున్న లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో నాగయ్య, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహమ్మద్ అలీ ఖాన్ బాబర్ మున్సిపల్ కౌన్సిలర్లు అధికారులు లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు విశాలావిశ్వం శ్రావణి జమ్రుద్ ఖాన్ పెంటయ్య మురళీమోహన్ అప్పి ప్రవీణ్ కోఆప్షన్ సభ్యులు రవితేజ తదితరులు పాల్గొన్నారు.

పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా 'ఇందిరమ్మ కుటుంబ బీమా'

అర్హులైన ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా:



ఇది కద నిజం, దుబ్బాక : రాష్ట్రంలోని పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం' ఎంతో కీలకమని గ్రామ సర్పంచ్ ఎమ్.నర్సింలు,కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షులు కలకుంట్ల స్వామి అన్నారు.బుధవారం దుబ్బాక మండలం గోసాన్ పల్లి గ్రామంలో ఈ పథకాన్ని వారు లాంఛనంగా ప్రారంభించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కుల, మత భేదాలు లేకుండా 18 నుండి 59 ఏళ్ల వయస్సు గల కుటుంబ పెద్దకు (సంపాదించే వ్యక్తికి) రూ.5 లక్షల జీవిత బీమా వర్తిస్తుందని తెలిపారు. ప్రీమియం మొత్తాన్ని ప్రభుత్వమే భరిస్తుందని, లబ్ధిదారులపై పైసా భారం ఉండదని స్పష్టం చేశారు. గ్రామపంచాయతీలలో ఆధార్ కార్డు, మొబైల్ నంబర్, నామినీ వివరాలతో దరఖాస్తు చేసుకుని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో గ్రామ సెక్రటరీ రేవతి,గ్రామ ఉప్ప సర్పంచ్ సుమన్ రెడ్డి,గ్రామ వార్డు సభ్యులు సలాంద్రి మహేష్,పలువురు వార్డు సభ్యులు,అంగన్వాడీ టీచర్ భాగ్యమ్మ,ఆశ వర్కర్స్,గ్రామ ప్రజలు పలువురు పాల్గొన్నారు.

యాదగిరిగుట్టలో వైభవంగా శ్రీ తిరుప్పాణి ఆళ్వార్ల తిరునక్షత్ర మహోత్సవం





ఇది కద నిజం,యాదగిరిగుట్ట: పన్నెండు మంది ఆళ్వార్లలో అపారమైన భక్తి, వినయాలకు ప్రతీకగా నిలిచే 'మునివాహనులు', గాయక సార్వభౌములు శ్రీ తిరుప్పాణి ఆళ్వార్ల తిరునక్షత్ర మహోత్సవం యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానంలో అత్యంత వైభవోపేతంగా నిర్వహించబడుతోంది. ఈ సందర్భంగా దేవస్థాన ప్రధాన అర్చకులు, స్థానాచార్యులు శ్రీ కాండూరి వేంకటాచార్యులు ఆళ్వార్ల దివ్య చరిత్రను, ఉత్సవ విశేషాలను భక్తులకు వివరించారు. రోహిణీ నక్షత్రాన్ని పురస్కరించుకుని ఆలయంలో ఉదయం విశేష తిరుమంజన కార్యక్రమం శాస్త్రోక్తంగా జరిగింది. సాయంత్రం వేళ శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారు, తిరుప్పాణి ఆళ్వార్లు ఆలయ మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దివ్య దర్శనమివ్వనున్నారు. అనంతరం అధ్యాపక స్వాములచే సేవాకాలం, స్వామివారికి ఆరగింపు, తీర్థప్రసాద గోష్టితో ఈ తిరునక్షత్ర మహోత్సవం పరిసమాప్తం కానుందని ఆలయ వర్గాలు తెలిపాయి.

శ్రీ తిరుప్పాణి ఆళ్వార్ల దివ్య వైభవం

తమిళనాడులోని ఉరైయూర్ దివ్యదేశంలో రోహిణీ నక్షత్రాన అవతరించిన తిరుప్పాణన్, నాటి సామాజిక కట్టుబాట్ల వల్ల ఆలయ ప్రవేశం లేకపోయినా నిత్యం కావేరీ నదీ తీరాన నిలబడి వీణ వాయిస్తూ శ్రీరంగనాథుని కీర్తించేవారు. ఒకనాడు ప్రధాన అర్చకులైన లోకసారంగ ముని విసిరిన రాయి ఆళ్వార్ల నుదుటికి తగలగా, ఆ గాయం గర్భాలయంలోని శ్రీరంగనాథుని నుదుటిపై కనిపించింది. "అతడు అంటరానివాడు కాదు, నా ప్రాణం" అని స్వామి ఆదేశించడంతో, లోకసారంగ ముని ఆళ్వార్లను తన భుజాలపై మోసుకుని గర్భాలయంలోకి తీసుకువెళ్లారు. నాటి నుండి ఆయన 'మునివాహనుడు'గా ప్రసిద్ధి చెందారు. గర్భాలయంలో శ్రీరంగనాథుని పాదాల నుండి శిరస్సు వరకు దర్శిస్తూ ఆళ్వార్లు పాడిన 'అమలన్ ఆదిపిరాన్' అనే 10 పాశురాలు నాలుగు వేల దివ్యప్రబంధ పాశురాలతో సమానమని, చివరికి ఆయన ఆ పెరియ పెరుమాళ్ళ దివ్య పాదాలలో ఐక్యమయ్యారని ప్రధాన అర్చకులు గుర్తుచేశారు. భగవంతుడికి కులమత బేధాలు లేవని, కేవలం నిర్మలమైన భక్తి మాత్రమే ప్రధానమని తిరుప్పాణి ఆళ్వార్ల చరిత్ర లోకానికి చాటిచెబుతోందని ఆయన పేర్కొన్నారు.

Registered No : APTEL/25/A0818
ఇది కద నిజం
గురువారం 26-11-2026





బజ్జీలు వేసిన బిచ్చగాడు హీరో!

'బిచ్చగాడు' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు ఎంతో చేరువైన విలక్షణ నటుడు విజయ్ ఆంటోనీ హైదరాబాద్‌లోని అమీర్‌పేట్ వీధుల్లో సందడి చేశారు. తన తాజా చిత్రం 'నాన్న కుట్టి' ప్రమోషన్ కార్యక్రమాల్లో భాగంగా నగరానికి వచ్చిన ఆయన, స్టార్ హోదాను పక్కనపెట్టి ఒక సామాన్యుడిలా రోడ్లపై తిరుగుతూ అందరినీ ఆశ్చర్యపరిచారు. అమీర్‌పేట్‌లోని చిరు వ్యాపారుల వద్దకు వెళ్లిన విజయ్ ఆంటోనీ, వారితో ఆప్యాయంగా మాట్లాడి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అంతేకాకుండా, ఓ బజ్జీల బండి వద్ద ఆగి స్వయంగా గరిటె పట్టి వేడివేడి మిర్చి బజ్జీలు వేసి అక్కడున్న వారిని సర్‌ప్రైజ్ చేశారు. అనంతరం స్థానికంగా ఉన్న ఓ ఇరానీ హోటల్లోకి వెళ్లి సాధారణ కస్టమర్‌లా కూర్చుని చాయ్, బన్ మస్కా రుచి చూస్తూ స్థానికులతో సరదాగా ముచ్చటించారు. తమ అభిమాన హీరో తమ మధ్యే సాదాసీదాగా తిరుగుతుండటాన్ని గమనించిన స్థానికులు, అభిమానులు ఆయనను చూసేందుకు పెద్ద ఎత్తున ఎగబడ్డారు. విజయ్ ఆంటోనీతో సెల్ఫీలు దిగేందుకు పోటీ పడ్డారు. ఎంతో ఓపికతో అందరినీ పలకరిస్తూ, ఫొటోలకు పోజులిస్తూ ఆయన తన సింప్లిసిటీని మరోసారి చాటుకున్నారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన ఫోటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

ఫహద్ ఫాజిల్ కొత్త ప్రయోగం!

మలయాళ వర్సటైల్ యాక్టర్ ఫహద్ ఫాజిల్, టాలెంటెడ్ డైరెక్టర్ సి. ప్రేమ్ కుమార్ ఓ థ్రిల్లర్ సినిమా కోసం చేతులు కలిపారు. అయితే ఈ సినిమాకు 'అసరీరి' అనే ఆసక్తికరమైన టైటిల్ ఖరారు చేసినట్లు అధికారిక ప్రకటన విడుదల చేశారు. ఫహద్ ఫాజిల్, శివాద, దర్శకుడు ప్రేమ్ కుమార్ ఈ ముగ్గురు తొలిసారి కలిసి పనిచేస్తున్న ప్రాజెక్ట్ ఇదే కావడం విశేషం. థ్రిల్లర్ కథాంశంతో తెరకెక్కుతున్న ఈ సినిమాను వచ్చే ఏడాది జనవరి 1న న్యూ ఇయర్ కానుకగా థియేటర్లలో గ్రాండ్‌గా రిలీజ్ చేయబోతున్నారు. ఈ ప్రకటనతో సినిమాపై అంచనాలు ఒక్కసారిగా పెరిగాయి. వేల్స్ ఫిల్మ్ ఇంటర్నేషనల్ బ్యానర్‌పై ఐసరి కె. గణేశ్ ఈ 'అసరీరి' చిత్రాన్ని నిర్మిస్తున్నారు. కథ, మేకింగ్ పరంగా కొత్తదనం చూపించేందుకు టీమ్ గట్టిగానే ప్లాన్ చేస్తోంది.

ఈ సినిమాలో శివాద, చేతన్, హరీశ్ ఉత్తమన్, కరుణాకరన్, శరణ్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. వీరందరి పాత్రలు కథలో చాలా కీలకంగా ఉండబోతున్నాయని సమాచారం. ప్రతి పాత్రకు కథలో ప్రత్యేకమైన ప్రాధాన్యత ఉంటుందని, సస్పెన్స్‌ను మరింత పెంచేలా వీటిని తీర్చిదిద్దారని తెలుస్తోంది. ఏ పాత్రలోనైనా ఇట్టే ఒదిగిపోయే ఫహద్ ఫాజిల్ నటన, తనదైన శైలిలో కథలను చెప్పే సి. ప్రేమ్ కుమార్ దర్శకత్వం తోడవడంతో 'అసరీరి'పై అప్పుడే మంచి క్యూరియాసిటీ ఏర్పడింది. థ్రిల్లర్ జానర్‌ను ఇష్టపడే ఆడియన్స్‌కు ఈ సినిమా ఎలాంటి అనుభూతిని ఇస్తుందో, న్యూ ఇయర్ రోజున థియేటర్లలో ఎలాంటి సందడి చేస్తుందో చూడాలని సినీ ప్రియులు, ఫ్యాన్స్ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



డిసెంబర్ బరిలో 'భగవంతుడు'!

తిరువీర్, ఫరియా అబ్దుల్లా జంటగా నటిస్తున్న తాజా చిత్రం "భగవంతుడు". ఈ సినిమాలో కన్నడ నటుడు రిషి కీలక పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రాన్ని రవి పనస ఫిలిం కార్పొరేషన్ (పనస మీడియా ఇండియా ప్రైవేట్ లిమిటెడ్) బ్యానర్‌పై ప్రొడక్షన్ నంబర్ 1గా నిర్మాత రవి కుమార్ పనస నిర్మిస్తున్నారు. విద్యా శ్రీ పనస సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. జి.జి. విహారి దర్శకత్వం వహిస్తున్న ఈ రొమాంటిక్ పీరియడ్ పొలిటికల్ యాక్షన్ డ్రామాను కూడా డిసెంబర్‌లో ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు తీసుకొచ్చేందుకు ప్లాన్ చేస్తున్నారు మేకర్స్. ఇప్పటికే ఈ సినిమా షూటింగ్, ప్యాచ్ వర్క్ కంప్లీట్ అయింది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయి. దీంతో త్వరలో మేకర్స్ అఫీషియల్‌గా రిలీజ్ డేట్ అనౌన్స్ చేయబోతున్నట్లు తాజాగా తెలిపారు. కాగా.. ఇప్పటికే ఈ చిత్రం నుంచి రిలీజ్ చేసిన ప్రమోషనల్ కంటెంట్, సాంగ్స్‌కి హ్యూజ్ రెస్పాన్స్ రాగా.. ఈ సినిమాపై మూవీ లవర్స్‌లో మంచి అంచనాలు ఏర్పడుతున్నాయి.



మెగాస్టార్‌తో మెగా టాక్ షో!

దశాబ్దాలుగా వెండితెరపై తన అద్భుత నటనతో, గ్రేస్‌తో కోట్లాది మంది అభిమానులను అలరిస్తున్న మెగాస్టార్ చిరంజీవి ఇప్పుడు డిజిటల్ వేదికపై సరికొత్త అవతారంలో ప్రేక్షకులను పలకరించడానికి సిద్ధమయ్యారు. ప్రముఖ ఓటీటీ దిగ్గజం నెట్‌ఫ్లిక్స్ వేదికగా ఆయన తొలిసారిగా వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్న ప్రత్యేక సెలబ్రిటీ టాక్ షో 'చిరంజీవీస్ మెగావర్స్' త్వరలోనే స్ట్రీమింగ్ కానుంది. గతంలో టెలివిజన్‌పై 'మీలో ఎవరు కోటీశ్వరులు' కార్యక్రమానికి హోస్ట్‌గా వ్యవహరించి మెప్పించిన చిరంజీవి, ఓటీటీ ప్లాట్‌ఫామ్‌పై టాక్ షో చేయడం ఇదే మొదటిసారి కావడంతో సినీ వర్గాల్లోనూ, అభిమానుల్లోనూ భారీ అంచనాలు నెలకొన్నాయి.

ఈ షో కాన్సెప్ట్ విషయానికి వస్తే, ఇదొక పూర్తిస్థాయి సెలబ్రిటీ చిట్-చాట్ కార్యక్రమం అని తెలుస్తుంది. ముఖ్యంగా తెలుగు సినీ పరిశ్రమకు చెందిన తన ఆప్తమిత్రులు, తోటి అగ్ర కథానాయకులు, దర్శకులు మరియు హాస్యనటులతో కలిసి చిరంజీవి ఈ వేదికపై ముచ్చటించనున్నారు. పాత తరం మధుర జ్ఞాపకాలు (మెగా నోస్టాల్జియా), తెర వెనుక దాగి ఉన్న ఆసక్తికర విశేషాలు, సినీ ప్రయాణంలోని అనుభవాలను సరదా సంభాషణల రూపంలో ప్రేక్షకులతో పంచుకోనున్నారు.


ఈ కార్యక్రమానికి సంబంధించిన ప్రచార కార్యక్రమాలు ఇప్పటికే వినూత్న రీతిలో ఆకట్టుకుంటున్నాయి. ప్రమోషన్లలో భాగంగా హైదరాబాద్ నగరవ్యాప్తంగా 'CHIRANJEEVI' అనే పేరులో మధ్యలో 'N' అక్షరాన్ని వదిలేసి CHIRA_JEEVI అంటూ భారీ హోర్డింగులను ఏర్పాటు చేశారు. నెట్‌ఫ్లిక్స్ లోగో అయిన 'N' అక్షరాన్ని ఈ విధంగా సృజనాత్మకంగా ఉపయోగించి అభిమానుల్లో తీవ్ర ఉత్కంఠను, ఆసక్తిని రేకెత్తించారు. ఈ షోకు సంబంధించిన అధికారిక ప్రారంభోత్సవ వేడుకను నవంబర్ 30, 2026 సాయంత్రం 4:30 గంటలకు హైదరాబాద్‌లో అత్యంత వైభవంగా నిర్వహించేందుకు నెట్‌ఫ్లిక్స్ భారీ ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం. సినీ ప్రముఖులు, భారీ సంఖ్యలో మెగా అభిమానుల సమక్షంలో జరగనున్న ఈ వేడుకలో 'మెగావర్స్' తొలి ప్రోమోతో పాటు షో ఫార్మాట్, ఎపిసోడ్ల వివరాలు మరియు అధికారిక స్ట్రీమింగ్ తేదీని ప్రకటించే అవకాశం ఉంది.

ఇప్పటికే ఈ టాక్ షోకు సంబంధించి కొన్ని ఎపిసోడ్ల చిత్రీకరణ పూర్తయింది. ఇందులో పాల్గొనబోయే అతిథుల జాబితా కూడా ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచుతోంది. సినీ దిగ్గజాలు కమల్ హాసన్, అక్కినేని నాగార్జునలతో పాటు పాన్ ఇండియా స్టార్ ప్రభాస్, పవర్ స్టార్ పవన్ కల్యాణ్, మెగా పవర్ స్టార్ రామ్ చరణ్, మాస్ మహారాజా రవితేజ, నేచురల్ స్టార్ నాని, ప్రముఖ దర్శకులు సందీప్ రెడ్డి వంగా, బాబీ కొల్లి, అలాగే హాస్యనటులు బ్రహ్మానందం, సునీల్, సత్య తదితరులు ఈ షోలో సందడి చేయనున్నట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఒకే వేదికపై చిరంజీవితో పాటు ఇంతమంది స్టార్లు కనిపించడం అభిమానులకు కనువిందు కానుంది.

గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్, ఆటమ్ మీడియా వెంచర్స్ , మరియు సోల్ ప్రొడక్షన్ ఎల్ఎల్పీ సంయుక్తంగా ఈ షోను నిర్మిస్తున్నాయి. డిసెంబర్ రెండో వారంలో (డిసెంబర్ 13 నుంచి) ఈ మెగా టాక్ షో నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ అయ్యే అవకాశాలు ఉన్నాయని సమాచారం.



యాపిల్ మ్యాప్స్‌లో 'వారణాసి' సెట్!



దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి, సూపర్ స్టార్ మహేష్ బాబు కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న అత్యంత ప్రతిష్ఠాత్మక చిత్రం 'వారణాసి' పై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమా నుంచి వచ్చే ప్రతి చిన్న అప్‌డేట్ సోషల్ మీడియాలో పెద్ద చర్చకు దారి తీస్తోంది. తాజాగా ఈ చిత్ర షూటింగ్ కోసం హైదరాబాద్‌లో నిర్మించిన భారీ కాశీ సెట్‌కు సంబంధించిన ఏరియల్ వ్యూ నెట్టింట వైరల్‌గా మారింది. ఇండియాలో ఇటీవల అప్‌డేట్ అయిన యాపిల్ మ్యాప్స్ ద్వారా ఈ సెట్‌ను గుర్తించిన నెటిజన్లు, దాని భారీ నిర్మాణాన్ని చూసి ఆశ్చర్యపోతున్నారు. 'వారణాసి' సినిమా కోసం చిత్ర యూనిట్ హైదరాబాద్‌లో అత్యంత భారీ స్థాయిలో కాశీ నగరాన్ని తలపించే సెట్‌ను నిర్మించినట్లు తెలుస్తోంది. ఇందులో పురాతన ఆలయాలు, గంగానది ఘాట్లను పోలిన నిర్మాణాలు, నగర వీధులు ఇలా అనేక అంశాలను ఎంతో ప్రతిష్ఠాత్మకంగా రూపొందించారు.

తాజాగా యాపిల్ మ్యాప్స్‌లో ఈ ప్రాంతానికి సంబంధించిన ఏరియల్ చిత్రాలు అప్‌డేట్ కావడంతో, సినిమా సెట్‌ను గుర్తించిన కొందరు నెటిజన్లు వాటిని సోషల్ మీడియాలో షేర్ చేస్తున్నారు. ఈ సెట్ విస్తీర్ణం, నిర్మాణాల సంఖ్య, ప్రాచీన నగరాన్ని తలపించే విధానం చూసి అభిమానులు రాజమౌళి విజన్‌ను ప్రశంసిస్తున్నారు. సినిమా కోసం ఇంత భారీ స్థాయిలో సెట్స్ నిర్మించడం మరోసారి ఆయన సినిమాల మేకింగ్ స్టాండర్డ్స్‌ను తెలియజేస్తోందని కామెంట్లు చేస్తున్నారు. 'వారణాసి' భారతీయ పురాణాల నేపథ్యంతో రూపొందుతున్న భారీ యాక్షన్ అడ్వెంచర్ చిత్రం. టైమ్ ట్రావెల్ అంశాలు కూడా ఇందులో కీలకంగా ఉండనున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ సినిమాలో మహేష్ బాబు 'రుద్ర' అనే పాత్రలో కనిపించనుండగా, ప్రియాంక చోప్రా 'మందాకిని'గా, పృథ్వీరాజ్ సుకుమారన్ 'కుంభ' పాత్రలో నటిస్తున్నారు.

విభిన్న కాలాలు, పురాణ అంశాలు, భారీ యాక్షన్ సన్నివేశాలు, విజువల్ ఎఫెక్ట్స్‌తో ఈ చిత్రాన్ని అంతర్జాతీయ స్థాయిలో తెరకెక్కిస్తున్నట్లు తెలుస్తోంది. రాజమౌళి గత చిత్రాల కంటే మరింత భారీ విజువల్ స్కేల్‌లో 'వారణాసి' ఉండబోతోందని అభిమానులు ఆశిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమా షూటింగ్ పూర్తయినట్లు సమాచారం. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. భారీ విజువల్ ఎఫెక్ట్స్, గ్రాఫిక్స్, ఇతర సాంకేతిక పనులపై చిత్ర బృందం ప్రత్యేక దృష్టి సారిస్తోంది. ఈ సినిమా కోసం రాజమౌళి అండ్ టీమ్ ప్రపంచ ప్రేక్షకులను దృష్టిలో పెట్టుకుని భారీ స్థాయిలో ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. మహేష్ బాబు, రాజమౌళి కాంబినేషన్‌లో వస్తున్న 'వారణాసి' సినిమాను 2027 ఏప్రిల్ 7న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నారు. ఈ సినిమా విడుదలకు ఇంకా సమయం ఉన్నప్పటికీ, భారీ సెట్స్, నటీనటుల లుక్, కథపై వస్తున్న ప్రచారంతో ఇప్పటికే గ్లోబల్ స్థాయిలో ఆసక్తి నెలకొంది.